క్లుప్తంగా

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సతీష్



ప్రిన్సిపాల్ సతీష్‌ను అభినందిస్తున్న పాలకవర్గం, అధ్యాపకులు

మలికిపురం: మలికిపురం ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా తోరం సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత 16 నెలలుగా ఆయన కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. సోమవారం నుంచి ఆయన పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన నేపథ్యంలో కళాశాల పాలకవర్గ కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణమూర్తి, పాలక వర్గ సభ్యులు రుద్రరాజు పద్మరాజు అధ్యాపకులు విజయకుమార్, ఆనంద మహానీ, రోహల్ బాబు తదితరులు సతీష్‌ను శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

విద్యార్థులకు చెక్కుల పంపిణీ



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

ఆత్రేయపురం: రాజమహేంద్రవరం శాఖ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆత్రేయపురం మహాత్మాగాంధీ జూనియర్ కళాశాలల్లో 27 మంది పేద మెరిట్ విద్యార్థులకు రూ.2.70 లక్షల నగదును బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసినట్లు ప్రిన్స్‌పాల్ బీవీఆర్ తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరం వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆ జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ముఖ్యఅతిథిగా పాల్గొని పేద విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. తమ పిల్లలకు ఈ నగదు ప్రోత్సాహం ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆ సంస్థ సూపర్‌వైజర్ విఘ్నేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ పీఎస్ రాజు తదితరులు ఉన్నారు.

నలుగురు వ్యక్తులపై కేసు

అయినవిల్లి: ఆస్తి విషయమై తనపై నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడి నెల్లివారి పేటకు చెందిన నెల్లి పూర్ణారావును తన మామ నుంచి వచ్చే ఆస్తి విషయమై అదే గ్రామానికి చెందిన నక్కా జ్యోతిబాబు, పండుబాబు మరో ఇరుగురు వ్యక్తులు తనపై చేతులతో, కర్రలతో దాడి చేసి గాయపర్చారని అయినవిల్లి పోలీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

స్టౌ, సిలిండర్ చోరీ

అయినవిల్లి: తన కాఫీ హోటల్‌లోని గ్యాస్ స్టౌ, సిలిండర్‌ను గుర్తుతెలియని దుండగులు దొంగిలించారని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అయినవిల్లి మండలం నేదునూరు పెదపాలెంలో కుడుపూడి శ్రీనివాసరావుకు చెందిన కాఫీ హోటల్‌లోకి జనవరి 30న రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి అందులో గ్యాస్ స్టౌ, సిలిండర్ దొంగిలించినట్లు తెలిపారు. కుడుపూడి శ్రీనివాసరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్పర్శపై అవగాహన

ఆలమూరు: కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో స్పర్శ అవగాహన సదస్సులు జరుగుతున్నాయి. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలా నాయుడు నేతృత్వంలో వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఈ పక్షోత్సవాలు ఈనెల 13 వరకూ జరుగుతాయని సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా తెలిపారు. సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు

అనారోగ్య బాధితుడికి సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సభ్యులు

రావులపాలెం: గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రాజమండ్రి మణికంఠ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 32 ఏళ్లకే రెండు కిడ్నీలు చెడిపోయి వైద్య చికిత్స కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు సమకూర్చిన రూ.15 వేల నగదు సాయాన్ని సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి అందజేశారు.

వలంటీర్ వ్యవస్థ ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శం

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



ఆత్రేయపురం సదస్సులో పాల్గొన్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



పి.గన్నవరంలో దుర్గారావుకు కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఆత్రేయపురం: రాష్ట్రంలో ఏర్పాటు చేసిన వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ దేశంలో ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండల కేంద్రం ఆత్రేయపురం మహారాజా ప్యాలెస్, మధ్యాహ్నం పేరవరం ఎస్వీ ఫంక్షన్ హాల్ వద్ద వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ ఇన్‌చార్జ్‌ల శిక్షణ సదస్సులు నిర్వహించారు. సోవారం ఉదయం ఆత్రేయపురంలో మహారాజా ప్యాలెస్ కల్యాణ మండపంలో ర్యాలి, అంకంపాలెం, ఆత్రేయపురం, నార్కెడ్‌మిల్లి, కట్టుంగ, తాడిపూడి, ఉచ్చిలి, వసంతవాడ, పులిదిండి, లొల్ల, మెర్లపాలెం, మధ్యాహ్నం పేరవరం ఎస్వీ ఫంక్షన్ హాల్ వద్ద పేరవరం, రాజవరం, బొబ్బర్లంక, వద్దిపర్రు, వెలిచేరు గ్రామాల వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో మండల బూత్ కమిటీ మేనేజర్ కప్పల శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సదస్సుల్లో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, గృహ సారథులు కలిసి రాబోయే 10 రోజుల్లో ప్రతి ఇంటిని సందర్శించి, ప్రభుత్వ పథకాల వివరాలు తెలియజేసి, ఐదు ప్రశ్నలకు వారి సమాధానాలు సేకరించి, వారి ఆమోదంతో స్టిక్కర్లను అందించాలన్నారు. ఎటువంటి సమన్వయలోపం లేకుండా వలంటీర్లు, గృహ సారథులు కలిసి పని చేయాలన్నారు. గృహసారథులను వలంటీర్లు ప్రతి ఇంటికీ పరిచయం చేసి ప్రతి ఇంటికీ అందించిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ దేశంలో ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. రాబోయే రోజుల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు మరింత ఉత్సాహంగా పని చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. దేశ చరిత్రలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా, అర్హులైన పేద, మధ్యతరగతి ప్రజల గుర్తించి సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు రాయి వెంకటేశ్వరరావు, కొల్లి శ్యాంసన్, సర్పంచ్‌లు పాలా నాగేశ్వరరావు, గాదిరాజు రామకృష్ణంరాజు, ముదునూరి గణపతిరాజు, గంటి విజయ భారతి, వేముల శ్రీనివాస్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు నిచ్చెనకోళ్ల రాణి, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేయాలి: ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా పని చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. మండలంలోని వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో పార్టీ నాయకుడు దేశిరాజు సీతారామయ్య గ్రౌండ్స్‌లో మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించేందుకు ఈ కమిటీలు కృషి చేయాలని అన్నారు. జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ అందిస్తున్న ఘనత జగన్‌కే దక్కిందన్నారు. జగన్ పాలనలో తన నియోజకవర్గంలో రూ.1690 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. మండల జేసీఎస్ కన్వీనర్‌గా దొమ్మేటి దుర్గారావును నియమించిన సందర్భంగా ఆయన్ను అభినందించారు. కన్వీనర్లు, గృహసారథులకు కిట్లు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మంతెన రవిరాజు, నగరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, సర్పంచ్‌లు వడలి కొండయ్య, కొంబత్తుల ఏసు, ఎన్.ప్రసన్న కుమార్, ఎస్.లక్ష్మణరావు, టీవీవీ సత్యనారాయణ, యన్నాబత్తుల ఆనంద్ సొసైటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

పందులను ఖననం చేయించాలని వినతి

మామిడికుదురు: వైరస్ బారిన పడి చనిపోతున్న పందులను ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా పడేయడం వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని బీజేపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. చనిపోయిన పందులను ఖననం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు వినతిపత్రం అందించారు. వైరస్‌తో చనిపోతున్న పందులను పంట కాలువలు, మురుగునీటి డ్రైన్లు, గోదావరి నదిలో పడేయడం వల్ల వాయు కాలుష్యం, నీటి కాలుష్యం పెరిగిపోయి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మృత్యువాత పడిన పందులను కుక్కలు తినడం వల్ల అవి కూడా వైరస్‌బారిన పడి చనిపోయే ప్రమాదం ఉందని వాపోయారు. ఈ సమస్యపై తక్షణం స్పందించాలని కోరారు. అదే విధంగా దాళ్వా సాగు జరుగుతున్న తరుణంలో పంట కాలువలను ఆధునీకరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, కంకిపాటి సుబ్బారావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, యేడిద సత్యనారాయణ, ఎస్.సాధిక్ ఉన్నారు.

నవరత్నాలతో అన్ని వర్గాలకు ప్రయోజనం

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- మాచవరంలో గడప గడపకూ..



అంబాజీపేటలో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలతో అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం సచివాలయం-1లో మూడో రోజు గడపగడపకూ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను, వారి పొందిన లబ్ధిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు నేడు పథకం ద్వారా విద్యా, వైద్యరంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఒకప్పుడు విద్యారంగాన్ని ఏలిన కార్పొరేట్ సంస్థలు నేడు తోక ముడిచాయన్నారు. కాపు నేస్తం, చేయూత పథకాల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన ఏర్పడిందన్నారు. కుల మత, వర్గ, పార్టీ భేదం లేకుండా పేదలకు సంక్షేమ పథకాల్ని పారదర్శకంగా పంపిణీ చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు ఇప్పించాలని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి మాట్లాడుతూ త్వరలోనే హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు, కొర్లపాటి కోటబాబు, సూదాబత్తుల రాము, అప్పన శ్రీను, కుసుమ శ్రీనుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, వాసంశెట్టి పెదబాబు, కోట సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుని సంబరం



అరిగెలవారిపాలెంలో వీరభద్రునికి చేసిన పూజలు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు అరిగెలవారి పాలెంలో వేంచేసియున్న వీరభద్ర స్వామి వారి సంబరాన్ని సోమవారం కనుల పండువగా జరిపారు. వీరభద్రుని ప్రతిమలతో స్థానిక కౌశిక వరకు శూలాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన చేపట్టారు.

విలసలో వీరభద్రుని సంబరం

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామంలో వీరభద్రునికి సోమవారం సంబరం నిర్వహించారు. వీరభద్రుణ్ణి అధిక సంఖ్యలో భక్తులు దర్శించి కానుకలు, మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

తాటికాయలవారిపాలెంలో..

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలో తాటికాయల సాయిబాబు నివాసంలో వెలసిన వీరభద్ర స్వామి వారి సంబరం సోమవారం వైభవంగా జరిగింది. వీరభద్రస్వామిని బ్యాండు మేళాలతో బాణసంచా కాలుస్తూ పురవీధుల్లో ఊరేగించారు., రంగామణి దంపతులతో పూజలు జరిగాయి. భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన చేశారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



దేవరపల్లిలో సూర్యనారాయణ కుటుంబానికి సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం: మండలంలోని దేవరపల్లిలో సోమవారం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిట్టూరి వెంకన్నను స్థానిక పార్టీ నాయకులతో కలసి పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మామిడిశెట్టి సూర్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.30 వేల సొంత నగదు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు సమకూర్చిన రూ.25 వేలు మొత్తంగా రూ.55 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వారి కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆర్థిక సాయం

ఆలమూరు: మండలంలోని మడికిలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. బాధితులైన గల్లా నాగవరలక్ష్మి, దేవరపూడి సత్యవతిని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన రూ.20 వేల ఆర్థికసాయం, నిత్యావసరాలు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. అలాగే పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు సమకూర్చిన రూ.ఐదు వేలను ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వ సాయాన్ని అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ యు.లక్ష్మీమౌనిక, ఉండ్రాసపు సుందరం విజయం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ దేవాలయాలుగా సచివాలయాలు



పొన్నమండ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: గ్రామీణ దేవాలయాలుగా సచివాలయాలు నిలుస్తున్నాయని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం పొన్నమండ సచివాలయ నూతన భవన నిర్మాణాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు. సర్పంచ్ కుక్కల బేబికుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ దేశవ్యాప్తంగా పేరుగాంచిందన్నారు. పరిపాలన వికేంద్రీకరణ ద్వారా నాణ్యమైన, న్యాయమైన పాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థ గ్రామాల్లో కీలకభూమికగా నిలిచిందన్నారు. ఎంపీపీ కేతా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మట్టా శైలజ తదితరులు పాల్గొన్నారు.

'యాలంగి' ట్రస్ట్ సేవలు అభినందనీయం



సుమిత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాజోలు: యాలంగి సుమిత్‌రామారావు ట్రస్ట్ సేవలు అభినందనీయమని మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణరాజు అన్నారు. సోమవారం కడలి గ్రామంలో న్యాయవాది, సోషల్‌వర్కర్ యాలంగి రమేష్ కుమారుడు సుమిత్‌రామారావు 8వ వర్ధంతి నిర్వహించారు. సుమిత్‌రామారావు చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేట్ విద్యాసంస్థ బలవంత విద్యకు తన కుమారుడు ప్రాణాలు కోల్పోయాడని, నాటి నుంచి సుమిత్‌రామారావు పేరుతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తండ్రి రమేష్ తెలిపారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయిని మేడిది ఎలిజబెత్‌రాణి, మొగలికుదురు మాజీ సర్పంచ్ సుభాషిణి, డ్వాక్రా నాగవేణిలను సత్కరించారు. కడలి సొసైటీ అధ్యక్షుడు, తోట సురేష్, రాష్ట్ర రైతు నాయకుడు బోనం నాగేశ్వరరావు, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాల కృష్ణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ గంజి అనంతం, మాజీ సర్పంచ్ మేడిది శేషగిరిరావు, యాలంగి రాధాకృష్ణ, అంబటి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ

మామిడికుదురు: మండలంలోని జగనన్న గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులకు నగరం మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మామిడికుదురు మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండలంలోని సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పెద్దింట్లమ్మకు పూజలు

రావులపాలెం: స్థానిక కొత్త కాలనీలో వేంచేసిన పెద్దింట్ల అమ్మవారి నాలుగో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అమ్మవారికి విశేష అభిషేకాలు, చండీ హోమం తదితర పూజలు నిర్వహించారు. ఈ పూజలను అర్చకులు అజయ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

బూత్ కమిటీలను బలోపేతం చేయాలి

రాజోలు: బీజేపీ బూత్ కమిటీలను బలోపేతం చేయాలని రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా పిలుపునిచ్చారు. సోమవారం రాజోలులో జిల్లా పార్టీ అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అధ్యక్షతన పార్టీ సమావేశం జరిగింది. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు విళ్ల దొరబాబు, చెల్లింగి త్రినాథరావు, వడ్లమూడి ప్రకాషరావు తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌ఫాల్ స్లూయిస్ రక్షణ పనులు ప్రారంభం

పి.గన్నవరం: మండలంలోని కె.ముంజవరంలో నదీ కోతకు గురవుతున్న అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు రూ.8 లక్షలతో రక్షణ పనులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కుంపట్ల గోవిందరావు, పార్టీ నాయకులు కుంపట్ల నాగప్రసాద్, నాగాబత్తుల సూర్యనారాయణ, బి.నాగరాజు, ఎం.మోహనరావు, ఎం.నాగేశ్వరరావు, ఆదినారాయణ, హెడ్‌వర్క్ ఏఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

అయినవిల్లి: గ్రామ పంచాయతీ పరిధిలోని పెదపేటలోని సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ రోడ్డును రూ.5 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మిస్తున్నట్లు జెడ్పీటీసీ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ కాకర శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ నంబూరి రాంబాబు, కడలి వెంకటరమణ, కాకిలేటి శ్రీనివాస్ పళ్ళిమాల లక్ష్మి తదితరులు ఉన్నారు.

ప్రతిభావంతులకు చేయూత



విద్యార్థికి నగదు ప్రోత్సాహం అందజేస్తున్న ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మం

మామిడికుదురు: ప్రతిభావంతులైన బీసీ విద్యార్థులకు అండగా నిలిచి వారికి చేయూతనందిస్తున్నామని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం పేర్కొన్నారు. మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 26వ వార్షికోత్సవం సోమవారం స్థానిక నైనాల రావూజీ బీసీ సామాజిక భవనంలో జరిగింది. సంఘం అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2021-22లో మండలంలో పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన బీసీ విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కాగితాలపల్లి నరసింహారావు, ఎండోమెంట్స్ ఈఓ బొక్కా వీరవెంకటేశ్వరరావు, అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భూపతి మనోహరరాజు, సంఘం గౌరవాధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు, నయినాల వరలక్ష్మి, పాటి వినోద్, వాసంశెట్టి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యానికి మేలు

అమలాపురం రూరల్: ఆటలతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తాలుకా ఎస్ఐ అందె పరదేశి అన్నారు. కామనగరువులో మాజీ సర్పంచ్ రాజులపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్‌ను తాలుకా ఎస్ఐ సోమవారం రాత్రి ప్రారంభించారు. పోటీల్లో 9 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కోనసీమ గౌడ సంఘం అధ్యక్షుడు రాజులపూడి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాజులపూడి వెంకటేశ్వరరావు, నీటి సంఘం మాజీ డైరెక్టర్ కామన గంగాధరరావు, రాజులపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా లక్షతులసి పూజ



ర్యాలిలో లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో సోమవారం స్వామికి లక్షతులసీ పూజ కన్నులపండువగా జరిగింది. ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, కలశపూజ, స్వామికి విశేష అభిషేకం, అనంతరం బాలభోగం, తులసీపూజ, గోపూజ, శాంతిహోమం, శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి లక్షతులసి పూజలో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

ఉత్తమ అధికారులను సమాజం ఎన్నటికీ మరువదు



ఉత్తమ అధికారులను సత్కరిస్తున్న ఎంపీపీ భూలక్ష్మి

పి.గన్నవరం: ఉత్తమ సేవలు అందించిన అధికారులను సమాజం ఎన్నటికీ మరువదని ఎంపీపీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. ఉత్తమ అధికారులుగా ఎంపికై గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న పలువురిని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె సత్కరించారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ టీఎస్ వెంకటాచార్య, ఎస్సై గంగాభవాని, డీటీ బి.గోపాలకృష్ణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ బి.చంద్రమోహన్ తదితరులను ఎంపీపీ భూలక్ష్మి దుశ్శాలువలతో సత్కరించారు. ఎంఈఓ కోన హెలీనా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.